# ఇలాంటి కొడుకులు ఉండాలి!

Nagarjuna

కొరుకొండ సత్యానంద్

వరండాలో వాలుకుర్చీలో కూర్చున్నాను.

జీవితంలోని మధ్యతరగతి బాధ్యతల్ని మోసి, అలసిపోయి, చతికిలబడిపోయాను... ఇంక నేనేమీ చేయలేను. అప్పటి ఉత్సాహం లేదు, ఇంక రాదు. అప్పటిలా కాలంతో పరుగులు తీయలేను, పురకలు వేయలేను... ఇప్పుడు నాకు ఆశలు, కోరికలు ఏవీ లేవు...

ఉన్నవల్లా ఆలోచనలు... అప్పుడప్పుడూ ఆకలి।

అవి ఆగిపోయేది ఈ తనువులో గుండె చప్పుడు చేయడం మానేసినప్పుడే।

గోడకున్న క్యాలెండరు కాగితాలు గాలికి రెపరెపలాడుతున్నాయి—


1986...

పందొసిమిది వందల ఎనభై ఆరు—

...అంటే, నేను రిటైర్ అయిపోయి అప్పుడే రెండు సంవత్సరాలు అయిపోయిందన్నమాట।

కాలం చాలా విచిత్రమైంది। మనల్ని తనతోపాటూ నడిపిస్తున్నట్టు నడిపిస్తూ ఒక్కొక్కసారి మనకంటే చాలా ముందుకు వెళ్ళిపోతుంది... లేకపోతే ఏమిటి? నేను రిటైర్ అయిపోయి రెండు సంవత్సరాలైనా, ఇంకా నిన్నకాక మొన్నటివరకూ ఉద్యోగం చేస్తున్నట్టే అనిపిస్తుంది.

ఆలోచనలు కళ్ళాలేసి మనసుల్ని లాగేస్తాయా! లేక కాలం మన కళ్ళు గప్పి దౌడుతీసి పారిపోతుందా? ఏది ఏమైనా, ఎలా జరిగినా కళ్ళప్పగించి చూస్తుండడమే గానీ జరుగుతున్నదాన్ని ఆపగలిగే శక్తిని ముసలితనం అపహరించేస్తుంది! అప్పుడప్పుడూ జీవితం ఏమిటి? అన్న ప్రశ్న సమాధానంకోసం ఆరాటపడుతున్నట్లుగా అనిపిస్తుంది




ఆలోచనల్లో!

అయినా ఎందుకు నాలో ఈ ఆలోచనలు? ఏమిటిది అప్పుడప్పుడూ కారణం కన్పించని ఈ మనస్తాపం? అలా ఆలోచిస్తుంటే గతం గుర్తుకొస్తుంది. అది వర్తమానంతో కలిసిపోయి నా ఆలోచనల్ని అయోమయస్థితిలో పడేస్తుంది...

లక్ష్మికి ఆపరేషన్ చేస్తేగానీ ఆనంద్ పుట్టలేదు— మరొక్క బిడ్డకే అవకాశం ఉంది అని డాక్టర్లు హెచ్చరించారు—

"లక్ష్మి! మువ్వు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించేసుకో! రెండో బిడ్డను కూడా ఆపరేషన్ చేసే తీయాల్సొస్తుందట ..." అన్నాన్నేను లక్ష్మితో.

"పర్వాలేదండి— మనకు బాబు ఉన్నాడు, పాప కూడా ఉంటే బాగుంటుంది—"

"కాని, నీవు మళ్ళీ గర్భం ధరిస్తే-"

"మీరేమీ భయపడకండి—ఆడదాన్ని నాకు ఆడపిల్లకూడా ఉండాలి— నా కోరికను మన్నించండి!"

నేను కాదనలేకపోయాను.

లక్ష్మి అనుకున్నట్టుగా తర్వాత అరుణ పుట్టింది.

నా బాధ్యతల్ని నేను సంపూర్ణంగా, సక్రమంగా నిర్వర్తించేను- నా కిప్పుడు ఏ బాదరబందీ లేదు. కానీ, గతంలోని కొన్ని సంఘటనల్ని స్థావరంగా చేసుకొని ఎందుకో నన్నీ మధ్య ఆలోచనలు వెంటాడుతున్నాయి.

వరండాగోడకు పడగ్గదిలోకి వెళ్ళే ద్వారం పైన అమ్మ, నాన్నగార్ల ఫోటోలు వేలాడుతున్నాయి. వరండా కిటికీలోనుంచి వస్తున్న గాలికి ఆ

ఫోటోలకు ఉన్న దండలు చిన్నగా ఊగుతున్నాయి. వాళ్ళిద్దరూ నిర్మలంగా నవ్వుతున్నారు. ఆ నవ్వు చూస్తుంటే అప్పుడప్పుడు నాలో నేనే గిల్టీ ఫీలవుతుంటాను ఏందుకో?

అప్పుడు...

నాకు ఉద్యోగం వచ్చిన రెండేళ్ళకే హైదరాబాదుకు ట్రాన్సుఫరయ్యింది— అమ్మకు, నాన్నగారికి ఆ విషయం చెప్పాను.

"వెళ్ళక తప్పదా బాబూ!" అని అడిగారు నాన్నగారు.

"తప్పదు నాన్నగారూ! అవుట్ ఆఫ్ స్టేట్ వెయ్యనందుకు మనం సంతోషించాలి—" అన్నాను నేను.

"అయితే ఏం చేద్దాం అనుకుంటున్నావు బాబూ!?"

"ముందు నేను వెళ్ళి జాయినై ఇల్లు చూసి వస్తాను—" అని బయల్దేరాను— హైదరాబాదులో ఓ చిన్న ఇల్లు చూసి ఇంటికి వెళ్ళాను.

"బాబూ! ఇల్లు దొరికిందా?" అని ఆతృతగా అడిగింది అమ్మ.

"దొరికిందమ్మా! కానీ చాలా చిన్న ఇల్లు. ఒక గది, వంటగది మాత్రమే ఉంది. అందుకని ముందు లక్ష్మి, నేను వెళ్తాం—తర్వాత మంచి ఇల్లు, అంటే మనందరికూ సరిపడే ఇల్లు దొరికాక మిమ్మల్ని కూడా తీసుకెళాను..." అన్నాను.

నేను ఆ మాట అన్నప్పుడు అమ్మ ముఖంలో కన్పించిన నిరుత్సాహం నాకిప్పటికీ గుర్తే? అయినా ఆగలేదు— లక్ష్మితో కలిసి వెళ్ళిపోయాను.

తర్వాత ఓ నెలకు ఇల్లు దొరికింది. ఆ ఇంట్లోకి మారాం. కానీ నేను అమ్మను నాన్నగార్ని తీసుకురావడానికి వెళ్ళలేదు.

"ఏమండీ! ఇల్లు బాగుంది కదా, అత్తయ్యను మామయ్యగార్ని తీసుకొచ్చెయ్యండి, అందరమూ కలిసి హాయిగా ఉందాం!" అంది లక్ష్మి ఒకసారి.

"లక్ష్మీ! మీ ఆడవాళ్ళకు ఖాళీ సమయంలో కాలక్షేపం కబుర్లు మాట్లాడుకోవడమే హాయి! కానీ సంపాదించి, ఇంటిని నడిపే మగవాడికి తను గడించేది ఇంటికి సరిపోయి, కొంత పొదుపు చేయడంలోనే హాయి. ఆనందం ఉంటాయి యిప్పుడు వాళ్ళను ఇక్కడికి తీసుకువస్తే ఖర్చు పెరుగుతుంది— పైగా వాళ్ళతో మనం ఉంటే ఎలాగైనా మనకు కొంత ఇన్‌కన్వీనియంట్‌గా ఉంటుంది"

"అదేమిటండీ అలా అంటారు— వాళ్ళుంటే మనకేం ఖర్చు ఎక్కువై పోతుంది? వాళ్ళకు మీరు పంపేది ఇక్కడ ఖర్చవుతుంది— వాళ్లుంటే మనకు ఇన్‌కన్వీనియంట్ అనుకుంటే ఎలాగండి?"

"నీకు అలాగే అన్పిస్తుంది లక్ష్మీ! ఈ వయస్సునుండే మనం కొంతలోకొంత పొదుపు చేసుకోకపోతే ముందు ముందు చాలా కష్టం అయిపోతుంది బ్రతకడం.

అందుకే, ఇప్పుడున్న అద్దె ఇంటిని ఖాళీ చేసేసి, నాన్నగారు రిటైరైపోయినప్పుడు కొన్న ఆ తాటాకింట్లోకి మారిపొమ్మని మొన్న నే ఉత్తరం వ్రాసేసాను. ఈ నెలనుండీ ఎంతోకొంత పంపిస్తే వాళ్ళే దాన్ని సర్దుకొని బ్రతుకుతారు-"

అలా వాదించి లక్ష్మి నోరు నొక్కేసానే గాని నేను అమ్మను, నాన్నగార్ని నా దగ్గరకు తీసుకురాలేదు.

ఒకసారి నేను ఆఫీసుపనిమీద మా ఊరు వెళ్ళి అలా మా తాటాకింటికి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి నాన్నగారు ఇంటిదగ్గర లేరు... లైబ్రరీకి వెళ్ళారట.

"బాబూ! నీతో ఓ విషయం మాట్లాడాలిరా!" అని అంది అమ్మ.

ఏమిటన్నట్లుగా చూశాను అమ్మ వైపు.

"ఒరే! పిల్లల్ని కని పెంచేది ముసలి వాళ్ళం అయిపోయాక వాళ్ళు చూస్తారనేరా! నీవు మమ్మల్ని పట్టించుకు తిరగకపోతే మేం ఎలా బ్రతుకుతాంరా!"

"నువ్వన్నది నిజమేనమ్మా! నేను పట్టించుకు తిరగకపోతే మీరెలా బ్రతుకుతారు? ఆ ఆలోచన నాకుంది కాబట్టే నేను మీ గురించి పట్టించుకుంటున్నాను..."

"ఒరే, నేను తల్లినిరా. నీవు మొదటి మాట నేర్చుకున్నది నా దగ్గరే! కానీ ఇలాంటి మాటలు ఎప్పుడు నేర్చుకున్నావురా? పట్టించుకు తిరగడం అంటే నెలకు ఎంతోకొంత పంపడం కాదురా, మా మంచిచెడ్డల గురించి ఆలోచించాలి. ఏది చేసినా! ఈ ముసలి వయసులో నీ తోడు, నీడ, ఆదరణ కావాలిరా! నువ్వు ఆ మాత్రమైనా మాకు అందించాలిరా!"

"అంటే నీ ఉద్దేశం ఏమిటి? నేను కావాలనే మీకు దూరంగా ఉంటున్నాననా? హైదరాబాదులో ఇల్లు దొరకడం గురించి, దొరికినా ఆ ఇంటి అద్దె నాలాంటి వాడికి అందుబాటులో ఉంటుందా అన్న విషయం గురించి ఆలోచిస్తే నువ్విలా మాట్లాడవమ్మా! సరిపుచ్చుకోలేని పరిస్థితి నాది. సరిపుచ్చుకోవాల్సిన సమయం మీది... పంపింది సరిపెట్టుకోండి. నాకు వేలకు వేలు ఆదాయం రావటంలేదు. నేనూ నాకు పుట్టబోయే పిల్లల గురించి ఆలోచించాలి కదమ్మా! నాకోసం మీరు మిగిల్చింది ఏమిటో, నాకోసం నేనైనా మిగుల్చుకోవాల్సిన అవసరం వుందో, లేదో కాస్త ఆలోచించమ్మా!"

అప్పుడు అమ్మ నవ్వింది... నిశ్శబ్దంగా నవ్వింది... ఆ నవ్వులోని బాధ నాకు అప్పుడు కన్పించలేదు... ఆలోచిస్తుంటే ఇప్పుడు నా గుండె కలుక్కుమంటుంది.

"అవున్రా! ఆలోచిస్తే నువ్వు చెప్పిన మాటలే నిజం అనిపిస్తోంది నాకు... మంచితనం, మానవత్వం అని మీ నాన్నగారు తనకి ఏమీ మిగుల్చుకోలేదు, ఇంక నీకేమి మిగుల్చుతారులే? దూరం ఆలోచించి ప్రవర్తించే నీ మనస్తత్వం

నా కెంతో ఆనందాన్నిస్తుందిరా! నువ్వు పిల్లల గురించి ఆలోచిస్తున్నావురా, మేము పుట్టి పెట్టింతయిన నీ గురించి ఆలోచిస్తున్నాము... నువ్వు బాధ్యతతో ఆలోచిస్తున్నావు, మేం స్వార్థంతో ఆలోచిస్తున్నాము... అంతేకదూ?"

అప్పుడు నాకు చాలా చిరాకేసింది— అందుకే నేను ఆ తర్వాత మా ఊరు వెళ్ళినా, మా ఇంటికి మాత్రం వెళ్ళలేదు.

తర్వాత అమ్మా, నాన్నగారు ఒకరి తర్వాత ఒకరు సంవత్సరం తేడాలో కాలంచేసారు... మా తాటాకింటిని అమ్మేసి ఆ డబ్బును అరుణ పేర బ్యాంకులో వేసాను. అరుణతో పాటు ఆ డబ్బూ పెరిగింది... దానికి కొంత జోడించి దానికి పెళ్ళి చేసాను.

జీవితంలో తప్పని ప్రతి ఖర్చుకూ నా సంపాదన ఒక్కటే సరిపోలేదు... ఏం కాదనుకున్నా అప్పుచేయడం తప్ప లేదు.

ఆనంద్ బాగానే చదివాడు. అందుకే ఆర్థిక ఇబ్బందుల ఒత్తిడిని అతి కష్టం మీద తట్టుకొని వాడి చదువు సాగేలా చేసాను. దానికి తగ్గట్టు వాడు ప్రయోజకుడయ్యాడు.

కానీ, నా చిన్నతనంలో పెద్దగా లేని సమస్య వాడికిప్పుడు తీవ్రంగా ఎదురయ్యింది. దానికి వాడిలో వాడే కుమిలిపోయేవాడు.

"నాన్నగారూ! మరో రెండు సంవత్సరాల్లో మీరు రిటైరైపోతారు. అప్పటికి నేను మీకు అందొస్తానో లేదో అని ఆలోచిస్తుంటే భయం వేస్తుందండీ!"

"ఎందుకురా భయం? తప్పకుండా ఉద్యోగం వస్తుంది. నిరుత్సాహపడకు. ధైర్యంగా ప్రతి ఇంటర్వ్యూకు హాజరవ్వు!"

అలా ధైర్యంచెప్పి ప్రతిఇంటర్వ్యూకు పంపేవాడిని... ఇంటర్వ్యూ అనేసరికి వడ్డీకి తెచ్చి వాడికి డబ్బు ఇచ్చేవాడిని. అప్పుడు మరికొంత అప్పు కలిసేది— ఒక్కోసారి వడ్డీకి వడ్డీ కట్టవలసొచ్చేది.

ఆఖరుకు వాడికి ఉద్యోగం వచ్చింది. వాడి చదువుకు తగ్గ ఉద్యోగం కాకపోయినా ఏదో ఒకటి వచ్చిందని సంతోషించాం అందరమూ!

వాడికి వచ్చిన కొత్త ఉద్యోగం, నాకయిన చివరి ట్రాన్సఫరూ, నా చిన్నతనం, నా చదువు, నా మొదటి పోస్టింగు, నా తల్లిదండ్రులు కాలం చేసింది... అన్నీ ఒక ఊర్లోనే అది ఇప్పుడు నే నుంటున్న ఈ ఊరే!

నేను రిటైరయ్యాక ఆఖర్న చేతికి అందిన డబ్బు నా అప్పులకి సరిపోయి కాస్త మిగిలింది... ఆ మిగిలిన డబ్బు చూసి నే నెందుకో వణికిపోయాను... నేను సంపాదించిన దాంట్లో అది చాలా తక్కువ... నా ముందు జీవితానికి అది ఎందుకూ సరిపడదు... గుండెను దిటవు చేసుకున్నాను. దాన్ని బ్యాంకులో వేసాను.

నచ్చిన అమ్మాయితో ఆనంద్ పెళ్ళి చేసాను. రిటైరైన తర్వాత వచ్చిన డబ్బుతో వాడి పెళ్ళి ఘనంగా చేద్దామనుకున్నాను. కానీ ఆనంద్ నన్ను వారించాడు. చాలా సింపుల్‌గా జరిగిపోయింది వాడి పెళ్ళి.

బ్యాంకునుండి వస్తున్న వడ్డీ ఇంటి అద్దెకు సరిపోయేది. ఆనంద్ జీతం ఇంటి ఖర్చులకు సరిపోయేది. ఏ దిగులూ లేకుండా కొన్నాళ్ళు సాగిపోయింది.

కానీ, ఒకరోజు ఆనంద్ ఆఫీసునుండి వస్తూనే "నాన్నగారూ! నాకు ట్రాన్స్ఫరయ్యింది!" అని చెప్పాడు. ఆ మాట విన్న నాలో ఎందుకో ఒక్కసారిగా అలజడి ప్రారంభమయ్యింది.

"ఏ ఊరు?" అలజడిని అదుపులోకి తెచ్చుకుంటూ అడిగాను నేను.

"మద్రాసు!"

"ఏం చేయదలచుకున్నావ్?"

"ఏం చేయమంటారు?"

"నీకెలా వీలైతే అలా చెయ్యి."

"నాకు మాత్రం వెళ్ళాలనే ఉందండి!"

నేను వాడి కళ్ళలోకి ఒక్కక్షణం చూసాను. నాలో అప్పటికప్పుడే ఏవో ఆలోచనలు వాడ్ని అనుమానంగా చూసాయి.

"ఏం నాన్నగారూ! అలా చూస్తున్నారు? నాకూ మీలాగే ఉంది... కాని వెళ్తేనే బాగుంటుందని నా అభిప్రాయం. అయినా వెళ్ళకుండా ఉండటానికి వీలు కాదు..."

అంటే... వాడు వెళ్ళిపోతాడన్న మాట. వెళ్ళిపోతే, వెళ్ళి మారిపోతే?

"అందుకే నేనో ఆలోచనకు వచ్చాను—ముందు నేను వెళ్ళి జాయినై మనందరకు సరిపడే ఇల్లుచూసి వస్తాను. తర్వాత మనందరం కలిసి వెళ్ళిపోదాం..."

నేను 'అలాగే' అన్నట్లుగా తల పంకించాను.

వెళ్ళిన పది రోజులకు వచ్చాడు ఆనంద్. వచ్చి రావడంతోనే ముందు నేనే అడిగాను వాడిని, "ఏరా ఇల్లు దొరికిందా?" అని...

"దొరికింది నాన్నగారూ, కానీ చాలా చిన్న ఇల్లు దొరికింది..."

"అయినా పర్వాలేదురా, ఇప్పుడు మనం ఉంటున్న ఈ ఇల్లు మాత్రం పెద్దదేవిట్రా?"

"కాదనుకోండి... కానీ ఈ ఇంటి వీధిలో, పెరట్లో పెద్దపెద్ద ఖాళీలున్నట్లు మద్రాసులో ఆ ఇంటికి లేవు. అందుకే ఓ పనిచేస్తాను నాన్నగారూ! ముందు సరోజ, నేను కలిసి వెళ్తాం, రెండు మూడు నెలల్లో ఓ మంచి ఇల్లు చూసి నేను వచ్చి మిమ్మల్ని తీసుకెళ్తాను... ఏమంటారు?"

"...అలాగే చెయ్యి"

నేనేమంటాను—? గతం నన్ను వాడి రూపంలో వెక్కిరిస్తుంటే, కరిగిపోయిన

కాలంలో జరిగిన సంఘటనలు పునరావృతమవుతుంటే కళ్ళప్పగించి చూస్తుండడమే తప్ప నే నేమనగలను?

వాడు కోడలుతో వెళ్ళిపోవడానికి అన్నీ సర్దేసుకున్నాడు.

వరండాలో ఉన్న నాకు గదిలో ఆనంద్ లక్ష్మితో మాట్లాడుతున్న మాటలు విన్పిస్తున్నాయి.

"అమ్మా! నాన్నగారికి నేను వెళ్ళటం ఇష్టంలేదు కదూ? నేను వెళ్ళిపోతున్నందుకు బాధపడుతున్నారు కదూ?"

"లేదురా! నాన్నగారు బాధపడ్డంలేదు. ఒక్కగానొక్క కొడుకువి, దూరం అవుతుంటే తల్లిదండ్రులం కదా, కాస్త దిగులుగా ఉంది అంతే!"

"అమ్మా! మీరేమీ దిగులుపెట్టుకోకండి. మనందరికీ సరిపడే ఇల్లు దొరికాక వచ్చి మిమ్మల్ని దగ్గరుండి తీసుకెళ్తాను. ఈ ట్రాన్స్ఫర్ వల్ల ప్రమోషన్ వచ్చే సమయానికి సీయార్ బాగుండే అవకాశం ఉంటుంది... మద్రాసులోని మా రీజనల్ ఆఫీస్‌లో ఇక్కడిలా ఫీల్డ్‌వర్క్ ఉండదు— వర్క్‌లో రిస్క్ ఉండదు— అందుకే నిజానికి నాకు ఇష్టంలేకపోయినా వెళ్ళడానికే సుముఖత చూపిస్తున్నాను— ఇవన్నీ నాన్నగారికి చెప్పమ్మా! ప్రతి నెలా మీకు డబ్బు పంపిస్తాను— ఇల్లు దొరికిన వెంటనే రెక్కలు కట్టుకొని వాలతాను— సరేనా?"

"అలాగే చెయ్యిరా! పిల్లల భవిష్యత్తుకు తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలు, ప్రేమాభిమానాలు అడ్డురాకూడదు— వెళ్ళు, వెళ్ళిన వెంటనే ఉత్తరం వ్రాయి!"

"అలాగేమ్మా!"

"బాబూ! నువ్వెళ్ళేది మద్రాసు, అక్కడ నీ జీతం సరిపోతోందో లేదో, మీకు సరిపోగా మిగిల్తేనే మాకు పంపు. మాకు పంపడంకోసం నువ్వు ఏ ఇబ్బందీ పడొద్దు!" అంది లక్ష్మి.


కోడలుతో వాడు వెళ్ళిపోయాడు.

వెళ్ళి ఇప్పటికి మూడు నెలలయ్యింది. ప్రతి ఉత్తరంలోనూ ఇల్లు ఇంకా దొరకడంలేదనే వ్రాస్తున్నాడు! ఈ మూడు నెలలూ డబ్బుకూడా పంపాడు.

అమ్మకు, నాన్నగారికి నే నప్పుడు అలాగే వ్రాసేవాడిని. డబ్బు పంపేవాడిని— కానీ యిల్లు దొరికాక కూడా యిల్లు దొరికిందని వ్రాయలేదు, వాళ్ళను తీసుకువెళ్ళడానికి రాలేదు.

ఆనంద్— వాడేం చేస్తాడో? వాడి మనసులో అభిప్రాయం ఎలా వుందో?

వాడు మంచివాడే! ఆ నమ్మకం ఉంది—ఇంక కోడలు— ఆ అమ్మాయి కూడా మంచిదే అని అనుకుంటున్నాను. ఆ అమ్మాయి ప్రవర్తనలో, మాటలో నా కెప్పుడూ ఎటువంటి అనుమానమూ రాలేదు. వేసవికాలంలో నేను, లక్ష్మి బయటే పడుకునేవాళ్ళం... చలికాలంలో




కాస్త ఇబ్బందిగా ఉండేది. ఇల్లు చాలక ఇబ్బందిగా ఉన్నా ఆ అమ్మాయి చూపులో, ప్రవర్తనలో ఎప్పుడూ ఎటు వంటి ఇబ్బందికరమైన భావం కన్పించ లేదు. కొత్తగా పెళ్ళైనవాళ్ళు, ఆనంద్ ఇంట్లో ఉన్నంత సేపూ ఉన్న ఈ చిన్న వరండాలోనే లక్ష్మి, నేను ఉండేవాళ్ళం. కానీ ఇప్పుడు ఆ అమ్మాయిలో మార్పొస్తే? లేక ఆనంద్‌లోనే అనుకోని మార్పు వస్తే!?

అప్పుడు— ఇదే పరిస్థితిలో లక్ష్మి ప్రవర్తనలో, మాటలో ఎటువంటి మార్పు రాలేదు కానీ, నేనే మారి పోయాను. ఎందుకో మారిపోయాను. ఎంతో స్వార్థంగా, నిర్దయగా ప్రవర్తిం చేను... అప్పుడు అమ్మా, నాన్న ఎంత కుమిలిపోయి ఉంటారో!?

ఆ పాపం ఆనంద్ రూపంలో ఇప్పుడు నాకు శాపంగా మారదు కదా!? మారితే!? అప్పుడు నా పరిస్థితి ఏమిటి? లక్ష్మి, నేను ఏమైపోవాలి?

"భోజనానికి లేవండి!"

లక్ష్మి మాట విని ఆలోచనల్లోంచి బయటికి వచ్చి లక్ష్మివైపు చూసాను.

"ఏమిటి, ఏదో దీర్ఘంగా ఆలోచిస్తు న్నట్టున్నారు?"

నేనేమీ మాట్లాడలేదు.

"ఏమిటండీ?" ఆందోళనగా అడుగుతూ గుమ్మంమీద కూర్చుంది లక్ష్మి.

"..............."

"చాలా సేపట్నుంచి అలాగే కూర్చొని ఏమిటాలోచిస్తున్నారు! నాకు చెప్ప కూడదా?"

"ఏం చెప్పమంటావు లక్ష్మీ? నేను ఆలోచించడం లేదు. వర్తమానం నన్ను

వెక్కిరిస్తుంటే గతం గుర్తొచ్చి బాధ పడుతున్నాను."

"అర్థమయ్యిందిలెండి, మన ఆనంద్ గురించేనా? వాడి గురించి నేనూ బాధ పడుతున్నాను—"

"నువ్వు మాత్రం బాధపడకుండా ఎలా ఉండగలవు లక్ష్మీ! మారిపోతున్న కొడుకును చూసి, రెక్కలొచ్చాయి కదా ఎగిరిపోదాం అని అనుకునే పిల్లల్ని చూసి ఎవరు మాత్రం బాధపడకుండా ఉండగలరు?"

"ఆదేమిటండీ వాడ్ని అలా అంటారు. అంత దూరంలో, ఆ పట్నంలో వాడెలా ఉన్నాడో అని ఆలోచిస్తూ నేను బాధ పడుతుంటే వాడిగురించి అలా మాట్లాడతా రేమిటి? మన ఆనంద్ గురించి మీరు అనవసరంగా అలా ఆలోచించి బాధ పడుతున్నారు గానీ వాడు అలాంటివాడు కాదండీ."

"ఏమో లక్ష్మీ! రోజులు గడుస్తున్న కొద్దీ నాకూ అలాగే అన్పిస్తుంది—వాడు రాడు లక్ష్మీ! మనల్ని తీసుకువెళ్ళడు—ఇప్పుడు తెలుస్తుంది అప్పుడు నేను చేసిందానికి మా అమ్మా, నాన్నగార్లు ఎంత యాతనపడ్డారో అని! వాళ్ళ కన్నీరు ఇప్పుడు వీడి రూపంలో నాకీ శిక్షను వేస్తుంది కదూ?"

"మీ ఆలోచించే విధానం మీతో ఇలా మాట్లాడిస్తుందని గానీ ఒక్కసారి వాడి వైపునుండి కూడా ఆలోచించండి... వాడు వెళ్ళి ఎన్నాళ్ళయిందనీ. ఇంత లోనే ఇల్లు దొరికేస్తుందటండీ? అయినా మనందరకూ సరిపడే ఇల్లు వాడి ఆఫీసుకు కాస్త దగ్గర్లో ఉండే ఇల్లుకోసం వెతుకుతున్నానని వ్రాసాడు కదండీ? ఆ మహానగరంలో అద్దెకు ఇల్లు అంత వేగంగా దొరుకుతుందటండీ? దొరికిన వెంటనే వాడొచ్చి మనల్ని తీసుకు వెళ్తాడు. నా మాట నమ్మండి, వాడు నా కొడుకండీ, వాడెప్పుడూ మీరనుకుంటు న్నట్టు చేయడు. ఇంక ఆలోచనలు ఆపి భోజనానికి లేవండి."

భారంగా నిట్టూరుస్తూ భోజనానికి లేచాను.

మజ్జిగన్నం కలుపుతుంటే "పోస్ట్" అన్న కేక విన్పించింది. లక్ష్మి వెళ్ళింది బయటికి. 'ఆనంద్ ఉత్తరం వ్రాసా డేమో' అని అనుకున్నాను గానీ అయిదు నిముషాల తర్వాత వచ్చిన లక్ష్మి, "మనకేమీ ఉత్తరాలు రాలేదండీ, పక్క వీధిలో వెంకట్రావుగారు లేరూ, వాళ్ళకి వచ్చిందది—ఎవరో మరి పొరపాటున ఆయన పేరు క్రింద ఇంటినంబరు మనింటిది వేసారు. ఈ మధ్యనే మారారు కదా, పోస్టుమాన్ అడిగితే కొంచెం ముందుకెళ్ళి చూపించి వచ్చాను" అని చెప్పింది.

"వాడు వ్రాసాడేమో అనుకున్నాన్లే!" అని చేయి కడుక్కొని లేచాను నిరుత్సాహంగా.



లక్ష్మి ఏమీ మాట్లాడలేదు

"నువ్వుకూడా తినేయ్ లక్ష్మీ!" అని చెప్పి మళ్ళీ వాలుకుర్చీలో కూలబడ్డాను.

"అలాగే" అని వంటగదిలోకి వెళ్ళిపోయింది లక్ష్మి.

నేను మామూలుగానే మళ్ళీ ఆలోచనల్లో పడిపోయాను.

లక్ష్మి భోజనంచేసి వచ్చి వరండాలో గోడకు ఆన్చి ఉన్న మడత మంచాన్ని గదిలో వేసి నా దగ్గరకు వచ్చింది.

"మంచం వేసేసాను, కాస్త నడుం వాల్చండి" అని వెళ్ళిపోయింది.

భారంగా లేచి మంచంమీద వాలేను. లక్ష్మికోసం చూసేనుగానీ లక్ష్మి రాలేదు. పెరట్లో బట్టలు ఉతుకుతున్న శబ్దం వినిపిస్తుంది.

"అన్నం తినగానే బట్టలుతుకుతుందేమిటి? రోజూ భోజనం చేయగానే తనూ కింద చాపవేసుకొని నడుం వాల్చేది కదా?' అనుకున్నాను నాలో నేనే.

లేచి వెళ్ళి అడగాలనుకున్నాను గానీ బద్ధకంతో, అదోరకమైన విస్పృత్తువతో లేవలేకపోయాను. కాసేపటికి నిద్రలోకి జారిపోయాను.

లేచేసరికి సాయంత్రం అయిపోయింది. లక్ష్మి టీ కప్పుతో వచ్చింది.

టీ తాగుతుంటే చాపమీద మడత

పెట్టిన చీరలు, నా పంచెలమీద దృష్టి పడింది.

"ఈ రోజేమిటి ఇన్ని బట్టలు ఉతి కావు?" అని అడిగాను.

"ఈ విషయాన్ని అంత వింతగా అడుగుతున్నారేమిటి?"

"ఏం లేదు. రోజూ మధ్యాహ్నం కాపే పైనా నడుం వాల్చకుండా ఉండవు కదా, అందుకని—"

"కొన్ని విషయాలు మనిషికి ఓపిక నిస్తాయి."

"ఏమిటో ఇప్పటి విషయం?" లక్ష్మి మాటలు అర్థంకాక అడిగాను.

"నాకైతే అది తెలిసిన విషయమే, మీకు మాత్రం విశేషం అది."

"ఏమిటి లక్ష్మీ! విశేషం ఏమిటి?"

"సంతోషా నిచ్చేది, అనుకోనిది జరగటం విశేషమే కదా?"

"ఏమిటిదంతా, అర్థమయ్యేటట్లు విషయాన్ని సూటిగా చెప్పు!" అని అన్నాను.

లక్ష్మి నావైపు అదోలా చూసి నవ్వుతూ అద్దం వెనకాల చేయిపెట్టి ఓ కాగితాన్ని తీసి "ఇదిగో మీరు అనుకోని విషయం. అనుమానించే విషయం, మీకు ఎంతో సంతోషానిచ్చే విశేషం!" అంటూ దాన్ని నా కందించింది.

టీ కప్పుని బల్లమీద పెట్టి, ఆ కాగి తాన్ని అందుకున్నాను.

అది ఆనంద్ వ్రాసిన ఉత్తరం...

గబగబా నా దృష్టి అక్షరాల వెంట పరుగులు తీసింది. ఉత్తరం చదవటం పూర్తిచేసాక నాలో ఆనందపు తరంగాలు ఉవ్వెత్తున లేచాయి.

లక్ష్మితో ఏవేవో మాట్లాడుదామని మనసు తొందరపడుతున్నా అదుపు తప్పిన ఆనందం ఆ పని చెయ్యనివ్వడం లేదు. అతి కష్టంమీద "లక్ష్మీ!" అని అనగలిగేను.

"ఇప్పుడేమంటారు?"

"ఏమంటాను! ఆనంద్ నీ కొడు కంటాను. వాడికి పట్టిన పాలల్లో నీ మనసును కలిపావంటాను!" అన్నాను.

ఆనంద్ వచ్చే ఆదివారం వస్తున్నాడు మమ్మల్ని తీసుకువెళ్ళడానికి వస్తున్నాడు. అక్కడ మా అందరికీ సరిపడే ఇల్లు దొరికిందట. సామాన్లన్నీ సర్దుకొని రెడీగా ఉండమన్నాడు.

"ఎందుకు లక్ష్మీ! ఇంత ఆలస్యంగా చూపించావ్ ఆ ఉత్తరాన్ని? మధ్యాహ్నం పోస్ట్‌మేన్ తెచ్చింది ఈ ఉత్తరాన్నే కదూ! వాళ్ళెవరికో వచ్చిందని అబద్దం చెప్పావు కదూ!?" అని అడిగాను లక్ష్మిని.

"అవును గానీ, ముందా టీ త్రాగండి, చల్లారిపోతుంది" అని నవ్వింది చిన్నగా అదోలా.

* * *

మాకైతే ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గదిలో వాలుకుర్చీలో పేపరు చదువు

కుంటూ కూర్చున్నాను నేను. లక్ష్మి హడావుడిగా వచ్చి "ఏమండీ! మీకో శుభవార్త!" అని అంది.

"ఏమిటి?" అని అడిగాను నేను.

"వెంట్రుకలింకా తెల్లబడందే నేను ముసలివాడ్ని ఎలా అవుతాను అని అంటుంటారుగా అప్పుడప్పుడు... ఇప్పుడు మాత్రం మీరు ఖచ్చితంగా ముసలివారై పోతారు" అంది.

లక్ష్మి మాటలు నాకు అర్థంకాక "ఏమిటో చెప్పు ముందు" అన్నాను.

"మీరు తాత కాబోతున్నారు."

"ఆఁ—అలాగా?"

"అలాగా అని ఆశ్చర్యపోకండి... తాత అని ముసలివాళ్ళనే అంటారని ఒప్పుకోండి"

"సర్లేవోయ్, నేను తాతనైతే నువ్వు మామ్మవు అయిపోతావ్‌గా? అది సరే గానీ, మన ఆనంద్‌ని పిలు— వాడు ఇవాళైనా వచ్చాడా వేగంగా?"

"వాడింకా రాలేదండి."

నేను గడియారం వైపు చూసాను. ఏడుం పావయ్యింది.

"ఏమిటీ లక్ష్మీ! రోజూ ఓవర్ టైం అని చెప్తాడు. అక్కడ చేసేటప్పుడు మాకు ఓవర్ టైమ్‌లు ఉండవు అనేవాడు" అని అడిగాను లక్ష్మిని.

ఆ మాట విన్న లక్ష్మి ముఖంలో ఏదో మార్పొచ్చింది... వాలుకుర్చీ పక్కనే గోడకు ఆనుకొని ఏదో చెప్పడానికన్నట్లుగా కూర్చుంది.

"కోడలుతో వాడు మనకు చెప్పద్దన్నాడండీ... కోడలేమో నాకు చెప్పి మీకు చెప్పొద్దండీ" అని ఆగింది.

"ఏం చెప్పొద్దండి?"

"చెప్పనండి... వాడు బాధపడతాడు."

"ఏమిటి లక్ష్మీ! నా దగ్గర దాయటం దేనికి?"

"ఎందుకులెండి."

నా మనసు రకరకాలుగా ఆలోచిస్తుంది వాడి గురించి.

"ఏమిటో చెప్పు లక్ష్మీ! వాడేమైనా చెడు అలవాట్లు చేసుకుంటున్నాడా?"

నేనన్న ఆ మాట విని లక్ష్మి నా వైపు కోపంగా చూసింది.

"అందుకే మీ దగ్గర ఏమీ అనకూడదు. ఎప్పుడూ మీరు వాడ్ని అపార్థం చేసుకోవడమే తప్ప నాకు ఇలాంటి కొడుకు ఉన్నాడని సంతోషించిన పుణ్యాన పోలేదు. వాడ్ని చూసి ఒక పక్క గుండె బరువెక్కిపోతుంటే మీ మాటలు విని అది పగిలిపోతుంది. మన ఆనంద్‌లాంటి కొడుకులు అందరికీ ఉండరండీ. ఇలాంటి కొడుకులు ఉండాలి అని అందరికీ ఉన్నా అందరికీ అలాంటి వాళ్ళు పుట్టరండీ... అలాంటిది వాడి గురించి మీరు ప్రతిసారీ ఆలోచించే విధానం చూస్తుంటే నాకు చిరాకుగా ఉంటుంది."

లక్ష్మికి నామీద కోపం వచ్చింది. అందుకే అలా మాట్లాడుతుంది... లక్ష్మికి

అంత కోపం రావడానికి కారణం ఏమిటి, అసలు నేనేమన్నానని? అదే అన్నాను లక్ష్మితో.

"మీ ఆలోచించే విధానం మీ మాటల్లోని చేదును మీకు తెలియజెప్పడం లేదు కానీ నా కడుపుతీపి మాత్రం దాన్ని భరించలేకపోతుంది. వాడికి మనమంటే వంచప్రాణాలూనండీ... వాడు కోడలుతో అస్తమానూ అంటుంటాడట... మా అమ్మానాన్నగార్లకు మనం తప్ప యింకెవరున్నారు. మనం వాళ్ళని కళ్ళలో పెట్టి చూసుకోకపోతే ఇంక మనం ఉండటం దేనికి, అని! వాణ్ని మీరు ఎప్పుడూ అదోలానే ఆలోచిస్తారు కానీ వాడు రోజూ రాత్రుళ్ళు ఎందుకు ఆలస్యంగా వస్తున్నాడో మీకు తెలీదు, తెలుసుకోవడానికి ప్రయత్నించక పోయినా అపార్థంగా మాత్రం ఆలోచించేస్తారు

"ఇంతకీ విషయం చెప్పు లక్ష్మీ! వాడెందుకు ఆలస్యంగా వస్తున్నాడు?"

"ఈ మహానగరంలో వాడి జీతం మీద మనందరం ఎలా బ్రతకగలమండీ? అందుకే వాడు రోజూ రెండుగంటలపాటు వేరేచోట పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాడట... ఆ విషయం మనతో చెప్పొద్దన్నాడట... తరచి తరచి అడిగితే కోడలు చెప్పింది. మనసులో ఉంచుకోలేక, మీరు మాట్లాడే మాటలు విని భరించలేక మీకు చెప్పేసాను."

లక్ష్మి మాటల్లో కోపం, చిరాకు, నిష్ఠూరం... వీటిని నేను భరించలేకపోయాను.

"బాధపడకు లక్ష్మీ! నువ్వన్న మాటల్లో నిజం ఉంది. నేనలా అనడానికి కారణం వుంది. నేను చెప్పినట్టే, నేను ఆలోచించినట్టే అందరూ చేస్తారని, ఆలోచిస్తారని అనుకునే నా మనస్తత్వం నాచేత అలా మాట్లాడిస్తుంది. నీకు కోపాన్ని, బాధను కలిగిస్తుంది!"

ఇంకా నే నేదో మాట్లాడుతుంటే తలుపుతట్టిన శబ్దం విని "ఇంక ఊరుకోండి. బాబు వచ్చినట్టున్నాడు...వాడితో ఈ విషయాలేవీ అనకండి" అని వెళ్ళి వీధితలుపు తీసింది లక్ష్మి.

వచ్చింది ఆనందే...లక్ష్మి గబగబా వంటగదిలోకి వెళ్ళి మిఠాయి తెచ్చి వాడి నోట్లో పెట్టింది. వాడు ఉక్కిరిబిక్కిరి అవుతూ కారణం అడిగితే లక్ష్మి చెప్పింది. అది విన్న వాడి ముఖంలో ఆనందం, సిగ్గు కలగాపులగంగా కన్పించాయి. వాడు కోడలు ఉన్న గదిలోకి వెళ్ళాడు. లక్ష్మి నా దగ్గరకొస్తుంటే అన్నాను. "వాడికి పెట్టావు గానీ, నాకు పెట్టవా మిఠాయి?" అని

"అప్పుడే మరచిపోయారా? మొన్న తీపి తింటే డయాబిటిస్‌లోకి దించేస్తుందని చెప్పిన డాక్టర్ మాటలు?"

"అవును కదూ. మరచిపోయాను లక్ష్మీ!" అని పైకి అన్నా.

'అందరూ నా గురించి ఆలోచిస్తారు. ఆలోచించేది సరిగ్గా ఆలోచిస్తారు...కానీ నేనే కొంతమంది గురించి ఆలోచించలేదు, పట్టించుకోలేదు... ఆలోచించేది కూడా సరిగ్గా ఆలోచించే అలవాటు కాలేదు... ఇక మీదనైనా నా ఈ తత్వాన్ని మార్చుకోవాలి!" అని నాలో నేనే అనుకున్నాను.